ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No: APTEL/2023/87888
శనివారం
06 సెప్టెంబర్ 2025

పాకతో యుద్ధం మే 10తోనే ముగియలేదు..
ఆర్మీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): జమ్మూకశ్మీర్లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్ అందరూ అనుకున్నట్లు మూడు రోజుల్లోనే ముగిసిపోలేదని, చాలా రోజులు కొనసాగిందని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ఢిల్లీలో 'ఆపరేషన్ సిందూర్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఇండియాస్ డీప్ స్ట్రైక్స్ ఇన్సైడ్ పాకిస్థాన్' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

అనంతరం ద్వివేది మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పాకిస్థాన్తో మే 10న యుద్ధం ముగిసిందని మీరు అనుకుంటున్నారు. కానీ కాదు. అనేక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండటంతో.. అది చాలా రోజులు కొనసాగింది. ఆ విషయాలన్నీ ఇక్కడ వెల్లడించలేను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాక్ మద్దతు ఉన్న ఉగ్రవాదులు ఇంకా ఉన్నారని, సరిహద్దు వెంబడి వారి చొరబాటు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. భారత్ చేపట్టిన ఆపరేషన్లో ఎంత మంది ఉగ్రవాదులు హతమయ్యారో అందరికీ తెలుసన్నారు. ఆపరేషన్ సమయంలో సాయుధ దళాల సహకారాన్ని ఆయన ప్రశంసించారు. ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలను ద్వివేది స్వాగతించారు. డ్రోన్లపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం హర్షణీయమన్నారు. భారత్ 'ఆపరేషన్ సిందూర్ 'తో పాక్, పీవోకేలోని ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా మె-రుపుదాడులు చేసింది. అత్యంత కచ్చితత్వంతో కీలక ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. దీంతో ఇరుదేశాల మధ్య కొన్ని రోజులపాటు భీకర ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. అనంతరం పాక్ అభ్యర్థన మేరకు భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది.

ట్రంప్ వ్యాఖ్యలను అభినందిస్తున్నా:మోదీ పోస్ట్

బిల్లీ, సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): భారత్-అమెరికా మధ్య టారిఫ్ విభేదాలు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా చమురు కొనుగోలు విషయంలో భారత్ పై కొంతకాలంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ వస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు స్వరం మార్చారు. భారత్కు దూరమయ్యామని అన్న ఆయన.. మోదీ గొప్ప ప్రధాని అంటూ తాజాగా కితాబిచ్చారు.

దీనికి భారత ప్రధాని స్పందించారు. ట్రంప్ సానుకూల వైఖరి అభినందనీయమని అన్నారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. "ఇరు దేశాల సంబంధాలపై అధ్యక్షుడు ట్రంప్ భావాలు, సానుకూల దృక్పథాన్ని అభినందిస్తున్నా. భారత్, అమెరికా మంచి భవిష్యత్తు, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి" అని మోదీ తన పోస్ట్లో రాసుకొచ్చారు. దీనికి కొన్ని గంటల ముందు భారత్తో సంబంధాలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. "భారత్, అమెరికా మధ్య ప్రత్యేక బంధం ఉంది. దీనిపై ఆందోళన ఏమీ లేదు. రెండు దేశాలు కొన్ని సందర్భాల్లో మాత్రమే విభేదిస్తాయి. నేను ఎప్పుడూ ప్రధాని మోదీతో స్నేహంగా ఉంటాను. ఆయన గొప్ప ప్రధాన మంత్రి. కానీ ఈ సమయంలో ఆయన చేస్తున్నది నాకు నచ్చలేదు" అని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని మోదీ హాజరైన సంగతి తెలిసిందే. ఆ సమావేశంలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్తోనూ ద్వైపాక్షికంగా భేటీ అయ్యారు. ఆ సమయంలో మోదీ, చైనా అధ్యక్షుడు జిన్పింగ్, పుతిన్ సన్నిహిత మిత్రుల మాదిరిగా ముచ్చటించుకున్నారు. దీనిపై ట్రంప్ తన ట్రూత్ సోషల్లో స్పందిస్తూ.. భారత్, రష్యాలను అమెరికా కోల్పోయిందని, అవి రెండూ చైనా చీకటి వలయంలో చిక్కుకున్నాయని అన్నారు. ఆ మూడు దేశాలు సుదీర్ఘ, సుసంపన్న భవితవ్యం కలిగి ఉండాలని కోరుకుంటున్నట్లు ఒకింత వ్యంగ్యంగా అన్నారు.

తిరుపతి జిల్లాలో ఆరు నెలల చిన్నారి అదృశ్యం

తిరుపతి, సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): జిల్లాలోని కోరమీను గుంటలో ఆరు నెలల చిన్నారి అదృశ్యమైంది. తండ్రితో పాటు నిద్రిస్తున్న పాపను శనివారం తెల్లవారుజామున 5.30 గంటలకు కనిపించడం లేదని గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలిపిరి పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు.

నాపై ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నా:హరీశ్ రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): ఇటీవల కవిత తనపై చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్రావు స్పందించారు. ఉద్యమం నుంచి 25 ఏళ్లుగా తన ప్రస్థానం తెరిచిన పుస్తకమని పేర్కొన్నారు. "ఇటీవల కాలంలో నాపై, పార్టీ పై కొందరు ఆరోపణలు చేశారు. ఎందుకు చేశారో? ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు చేశారో?. నాపై చేసిన ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను. కేసీఆర్ గత పదేళ్లుగా నిర్మించిన ఒక్కో వ్యవస్థను సీఎం రేవంత్రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారు. రాష్ట్రంలో ఓ వైపు రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతుంటే ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మంచివి కావు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే మా ముందున్న కర్తవ్యం" అని హరీశ్రావు అన్నారు.

బాలాపూర్ లడ్డూ రూ.35 లక్షలు

హైదరాబాద్, సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్టాత్మకమైన బాలాపూర్ లడ్డూ వేలం పాట ఘనంగా సాగింది. ఈ సారి లడ్డూ వేలంలో భారీ ధర పలికింది. దీన్ని కర్ణాటకు చెందిన లింగాల దశరథ గౌడ్ అనే వ్యక్తి రూ.35 లక్షలకు దక్కించుకున్నారు.

వేలంలో 38 మంది భక్తులు పాల్గొన్నారు. గతేడాది ఈ లడ్డూను రూ.30.01 లక్షలకు కొలను శంకర్ రెడ్డి దక్కించుకున్నారు. గతేడాదికంటే ఈసారి లడ్డూ ధర రూ.4.99 లక్షలు అధికంగా పలికింది. లడ్డూ విజేత దశరథగౌడ్ను ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సన్మానించింది. 'బాలాపూర్ లడ్డూ అంటే నాకు చాలా ఇష్టం. ఆరేళ్లుగా దీని కోసం ప్రయత్నిస్తున్నా. ఇన్నేళ్ల తర్వాత బాలాపూర్ లడ్డూ దక్కింది. ఎంతో సంతోషంగా ఉంది" అని దశరథగౌడ్ పేర్కొన్నారు.

గ్రానైట్ లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. 30 మందికి గాయాలు

చంద్రగిరి, సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం అగరాల సమీపంలో ముందు వెళ్తున్న గ్రానైట్ లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో 30 మందికి గాయాలయ్యాయి. బస్సు బెంగళూరు నుంచి తిరుపతికి వస్తుండగా ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో అందులో 48 మంది ప్రయాణికులున్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



రిపబ్లిక్ సినిమా CINEMA

ఆ సినిమా 60 సార్లు చూశాను : సందీప్ వంగా

'బాహుబలి 2' ఇంటర్వెల్ సీన్ చూసిన తర్వాత తనకు 'అర్జున్ రెడ్డి' విషయంలో భయం వేసిందని దర్శకుడు సందీప్ వంగా అన్నారు. 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమంలో సందీప్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నటుడు జగపతి బాబు హోస్ట్ గా వ్యవహరిస్తున్న ఈ టాక్ షో 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. తాజా ఎపిసోడ్కు రామ్ గోపాల్ వర్మ, సందీప్ వంగా అతిథులుగా హాజరయ్యారు. రామ్ గోపాల్ వర్మ గురించి సందీప్ మాట్లాడుతూ.. "ఆయన ఎన్నో విషయాల్లో నాకు గురువు. ఆయన చిత్రాలు చూసి తెలియని విషయాలు నేర్చుకున్నా. 'సత్య' సినిమా 50, 60 సార్లు చూశాను. అది చూసే ఎడిటింగ్ నేర్చుకున్నా" అని చెప్పారు."నేను ఇప్పటి వరకూ చూసిన సినిమాల్లో 'బాహుబలి 2' ఇంటర్వెల్ హైలైట్. దానికి మించిన ఇంటర్వెల్ సీన్ ఇప్పటి వరకూ లేదు. అది చూసి నా స్టూడియోకు వచ్చి 'అర్జున్ రెడ్డి' ఇంటర్వెల్ సీన్ చూశాను. ప్రేక్షకులకు నచ్చుతుందా లేదా అని ఒక్క నిమిషం భయం వేసింది. ఇంటర్వెల్ కూడా గొప్పగా ఉండాలని రాజమౌళి నిరూపించారు. 'అర్జున్ రెడ్డి' ట్రైలర్ విడుదలయ్యాక ప్రేక్షకుల స్పందన చూసి నాకు ధైర్యం వచ్చింది" అని చెప్పారు. ప్రభాస్ హీరోగా తాను తెరకెక్కించనున్న 'స్పిరిట్ అప్డేట్ను సందీప్ షేర్ చేశారు. "ఏ సినిమాకు అయినా షూటింగ్ కంటే ముందే బ్యాక్గ్రౌండ్ మ్యూజిక్ సిద్ధం చేసుకుంటే చాలా సమయం మిగులుతుంది. ఈ విషయం నాకు 'అర్జున్ రెడ్డి' సమయంలో తెలియలేదు. 'యానిమల్' చిత్రీకరణకు ముందే 80 శాతం మ్యూజిక్ వర్క్ పూర్తి చేశాం. ఇప్పుడు 'స్పిరిట్కు అదే పని చేస్తున్నా. ఇప్పటి వరకూ 70 శాతం బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ రెడీ అయిపోయింది. ప్రభాస్ స్వీట్ పర్సన్. పెద్ద స్టార్ కాబట్టి అతడితో వర్క్ చేయడం ఎలా ఉంటుందో అనుకున్నాను. కానీ, ఎలాంటి ఇబ్బందులు ఉండవని అర్థమైంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభించనున్నాం. అప్పుడు ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు పంచుకుంటాను" అని సందీప్ వంగా తెలిపారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్

అక్కడ చోటే లేదు..
ఇక్కడ శ్రేయస్ అయ్యర్కు నాయకత్వం!

టీం ఇండియా తరపున అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించినా.. జట్టు కూర్పులో శ్రేయస్ అయ్యర్కు చోటు లభించడం లేదు. తాజాగా ఆసియా కప్ స్క్వాడ్లోనూ స్థానం లేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు వస్తున్న కథనాల ప్రకారం శ్రేయస్ అయ్యర్కు సారథి బాధ్యతలు అప్పగిస్తారంటూ ప్రచారం సాగుతోంది. అయితే, ఇది సీనియర్ క్రికెట్ జట్టుకు కాదు. ఇండియా ఏ జట్టు మరికొద్ది రోజుల్లో ఆస్ట్రేలియా ఏతో రెండు అనధికారిక టెస్టులు ఆడనుంది. ఆ జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహిస్తాడు. వచ్చే వారంలో ఆస్ట్రేలియా ఏ టీమ్ భారత్కు రానుంది. లఖ్నవూలోని ఏక్నా స్టేడియంలో టెస్టులతోపాటు మూడు అనధికారిక వన్డేల్లోనూ ఇరు జట్లూ తలపడతాయి. ఇంకా స్క్వాడ్ను బీసీసీఐ ప్రకటించలేదు. అయితే, శ్రేయస్కే కెప్టెన్సీ అప్పగిస్తారని సమాచారం.

ప్రస్తుతం దులీప్ ట్రోఫీలో..

ఆసియా కప్ కోసం ఎంపిక కాకపోవడంతో శ్రేయస్ అయ్యర్ ప్రస్తుతం దేశవాళీలో ఆడుతున్నాడు. వెస్ట్ జోన్కు ప్రాతినిధ్యం వహిస్తోన్న అతడు బ్యాటింగ్లో దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాడు. తొలి ఇన్నింగ్స్ లో 28 బంతుల్లో 25 పరుగులు చేశాడు. మరోవైపు రుతురాజ్ గైక్వాడ్ (184) భారీ శతకం సాధించడం గమనార్హం. ఇక యశస్వి జైస్వాల్ (4) సింగిల్ డిజిట్కే పరిమితమయ్యాడు. దులీప్ ట్రోఫీలో వెస్ట్ జోన్కు సారథిగా వ్యవహరిస్తోన్న శార్దూల్ ఠాకూర్ (64) హాఫ్ సెంచరీ చేశాడు. జగదీశన్, రజత్ పటీదార్ కూడా మెరుగైన ప్రదర్శన చేశారు. దీంతో ఆస్ట్రేలియా ఏతో అనధికారిక టెస్టు సిరీస్కు ఎంపిక చేసే స్క్వాడ్లో వారికి చోటు దక్కడం ఖాయమేనని క్రికెట్ వర్గాల అంచనా.

ఇంటి చిట్కాలు

ఎండలు పెరగడంతో మైగ్రేన్ తలనొప్పి మొదలైందా, బాధపడకుండా కొన్ని పదార్థాల వాసనని చూడండి సమస్య మీ దరికి రాదు

మైగ్రేన్..
తలకి ఒకేవైపుకి వచ్చే ఈ నొప్పితో చాలా మంది ఇబ్బంది పడతారు. దీనినే పార్శ్వపు అని కూడా అంటారు. దీనిని తగ్గించేందుకు కొన్ని ఇంటి చిట్కాల గురించి తెలుసుకోండి.

తలనొప్పి వచ్చిందంటే ఓ చోట మనసు కుదుటగా ఉండదు. ఇక మైగ్రేన్ తలనొప్పి అంటే బాబోయ్ చాలా కష్టం. ఇది ఎండకాలం వస్తోంది కాబట్టి మరింత పెరిగే అవకాశం ఉంది. దీనికి కారణాలు చాలానే ఉంటాయి. అందులో ముఖ్యంగా నిద్రలేకపోవడం, టైమ్కి తినకపోవడం, ఎక్కువగా కెఫిన్ తీసుకోవడం, వర్కౌట్ చేయకపోవడం, ఒత్తిడి, పీరియడ్స్ ఇలా చాలానే కారణాలు ఉంటాయి. వీటన్నింటిని సరిచేసినప్పటికీ నొప్పి ఇంకా ఉందంటే కొన్ని ఇంటి చిట్కాలు పాటించొచ్చు. వీటి వల్ల కూడా చాలా వరకూ తలనొప్పి తగ్గుతుంది. పైగా ఇవన్నీ కూడా ఇంట్లో మనకి రెగ్యులర్గా దొరికే ఆహార పదార్థాలే. అవేంటో ఇప్పుడు చూద్దాం.

అల్లం



మైగ్రేన్ సహా వికారం, వాంతుల వంటి సమస్యల్ని తగ్గించడంలో అల్లం బాగా పనిచేస్తుంది. అల్లాన్ని మనం చిన్న ముక్కలుగా కట్ చేసి నోటిలో వేసుకుని రసం పీల్చడం లేదా దీనిని మనం టీలా చేసుకుని తాగడం వల్ల సమస్య తగ్గుతుందని చెబుతున్నారు.

మసాజ్



మనం మైగ్రేన్ ఉన్నప్పుడు రెగ్యులర్గా తలని మసాజ్ చేయడం వల్ల సమస్య తగ్గుతుంది. మైగ్రేన్ రిలీఫ్ కోసం ఏదైనా ఓ నూనెని తీసుకుని తలకి తెలవెనుక భాగంలో నిదానంగా మసాజ్ చేయండి. రెగ్యులర్గా ఇలా చేస్తే తలనొప్పి ఆటోమేటిగ్గా తగ్గుతుంది.

పెప్పర్మెంట్ ఆయిల్

పెప్పర్మెంట్ ఆయిల్లో కొన్ని గుణాలు మైగ్రేన్ని తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది పెప్పర్మెంట్ ఆకుల వాసన చూసినా సమస్య తగ్గినట్లుగా అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ వాసన చూడడం వల్ల చాలా వరకూ రిలాక్స్గా ఫీల్ అవుతున్నారని దీనికోసం రెగ్యులర్గా పెప్ప-ర్మెంట్ వాసన చూడడం మంచిదని చెబుతున్నారు.

మిరియాలు

మిరియాలు వంటకి రుచిని అందించడమే కాదు. తలనొప్పిని కూడా ఆటోమేటిగ్గా తగ్గిస్తాయి. దీనికోసం మనం మిరియాలని ఎలా అయినా తీసుకోవచ్చు. వంటల్లో వాడడం, రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగడంలం వంటివి చేయడం వల్ల సమస్య చాలా వరకూ తగ్గుతుంది. నల్ల మిరియాల్లో ఎక్కువగా యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నేచురల్ పెయిన్ కిల్లర్స్లా పనిచేస్తాయి. ఈ మిరియాల్లోని విటమిన్స్, మినరల్స్ తలనొప్పి చాలా వరకూ తగ్గుతాయి.

లావెండర్ ఆయిల్

లావెండర్ ఆయిల్తో ఎన్నో లాభాలు ఉంటాయి. వాసన చూడడం వల్ల కూడా మైగ్రేన్ పెయిన్ తగ్గిస్తుంది. దీనిని డైరెక్ట్గా వాసన చూడొచ్చు. లేదా ఏదైనా క్యారియర్ ఆయిల్లో కలిపి తల వెనుక భాగంలో రాయొచ్చు. కొన్ని అధ్యయనాల ప్రకారం మనం 3 నెలల పాటు లావెండర్ థెరపీని ట్రై చేయడం వల్ల మైగ్రేన్ అలాక్ తగ్గిందని చెబుతున్నారు.